క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీవరం ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎనిమిది కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులను ఇంటర్వ్యూ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధ్రువపత్రాలు అందించాలి..

పాలకొండ రూరల్: భూముల రీ సర్వే చేయించుకున్న రైతులు వెంటనే హక్కు తెలియజేసే ధ్రువపత్రాలు వెంటనే అందించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ పట్టణ పరిధిలో సమగ్ర భూసర్వే పూర్తయినా, ధ్రువపత్రాలు ఇవ్వడంలో రైతులు వెనుకబడ్డారన్నారు. రెండు రోజుల్లో డాక్యుమెంట్లను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

దళితులకు భూ హక్కులు కల్పించాలి

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామ దళితులు సాగు చేస్తున్న భూములపై వారికి హక్కులు కల్పించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకుడు రెడ్డి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద 36 గంటల ధర్నా సోమవారం చేపట్టారు. గ్రామంలోని 14 మంది దళిత కుటుంబాలకు 22 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చిందని, దురదృష్టవశాత్తు ఆయా భూముల పట్టాలు రద్దు అయ్యాయని, వాటిని పునరుద్ధరించి, సంబంధిత దళిత కుటుంబాలకు ఇవ్వాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పరామర్శ



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని సోమగండి గ్రామానికి చెందిన నిమ్మక ద్రౌపది ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈమె వెంట ఏఎంసీ చైర్మన్ హిమరక మోహనరావు, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, మహేష్, పలువురు సర్పంచ్‌లున్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రవళిక



విద్యార్థిని ప్రవళికతో పాఠశాల సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల విద్యార్థిని టి.ప్రవళిక ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యుగంధర్ సోమవారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రవళిక పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ధాన్యం తరలింపు



బాలేరులో ధాన్యం తూకం వేస్తున్న వ్యవసాయాధికారులు

భామిని: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోళ్లను వ్యవసాయాధికారులు వేగవంతం చేశారు. మండలంలోని బాలేరు, సోలికిరి గ్రామాల్లో రైతుల దగ్గరున్న తడిసిన ధాన్యాన్ని వ్యవసాయ సహాయకులు సోమవారం కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు జ్యోతి, రైతుమిత్ర తిరుపతిరావు పాల్గొన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా ధాన్యం తరలింపు వేగవంతం చేస్తున్నామని సిబ్బంది తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

రాజాం సిటీ/వంగర: మండల కేంద్రాల్లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజాంలోని భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్‌కుమార్ పాల్గొని, దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగుల్లోని ప్రతిభాపాటవాలను గుర్తించి, ప్రోత్సహిస్తే వారు కూడా అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు ట్యాబ్‌లు, బహుమతులు అందజేశారు. కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.



పాలకొండ: భీమలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గరుగుబిల్లి: ఉల్లిభద్రలో పూజలు చేస్తున్న భక్తులు

శివోహం..!

కార్తీక సోమవారం పురస్కరించుకుని, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని, దైవదర్శనం చేసుకున్నారు. ప్రత్యేకాభిషేకాలు, పూజలు, దీపారాధనలు నిర్వహించారు. మరోవైపు భక్తుల ఓం శివోహం, హరహరమహాదేవ నినాదాలతో శివనామస్మరణ మార్మోగింది. వాడవాడలా జరిగిన ఈ కార్యక్రమంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

–సాక్షి నెట్‌వర్క్.



పాలకొండ: భీమలింగేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు



వీరఘట్టం: కుంబేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు



వీరఘట్టం: దైవదర్శనం కోసం క్యూలో బారులుతీరిన భక్తులు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

గరుగుబిల్లి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ ఉరిటి రామారావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని రావివలస గ్రామంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంలో పాల్గొన్న వారు తొలుత వైఎస్సార్ సీపీ జెండా, ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు అమలు కూడా ఉందన్నారు. ప్రతీ ఇంటికి ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించి, వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.అప్పడు, వైస్ ఎంపీపీ ఎస్.లక్ష్మి, ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, తోటపల్లి దేవస్థానం చైర్మన్ ఎం.సత్యనారాయణ గ్రామైక్య సంఘ అధ్యక్షురాలు జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, అధికారులు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆమె తుపానుపై గ్రామస్తులను అప్రమత్తం చేసేందుకు దండోరా వేయించాలని సూచించారు. ప్రధానంగా నదీ తీర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రక్షిత తాగునీటి పథకాలు నీటితో నింపాలన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ ప్రమాదాలు ఎక్కడా జరగకుండా చూడాలన్నారు. ఆపద సమయంలో అధికారుల సహాయం కావాల్సిన వారు ఫోన్ నంబర్ 8008648669ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో (ఎఫ్‌ఏసీ) జి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: కంట్రోల్ రూమ్‌లో అధికారుల బృందం

ఇదిలా ఉండగా, తుపాను నష్ట నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని చింతలపాడు, బెల్లిడి, రేగిడి, దొరజమ్ము గ్రామ పాఠశాలల్లో సైక్లోన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంఈవోలు బి.చంద్రశేఖర్, బి.జనార్దన్ తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిద్దాం..

పాలకొండ రూరల్: ఈ నెల 7వ తేదీ నుంచి జరగాల్సిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలనుమ ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దామని మండల వ్యాయామోపాధ్యాయులు నిర్ణయించారు. సచివాలయ స్థాయిలో ఐదు రోజుల పాటు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, తదితర క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డొంక త్రినాథులు, మండల విద్యాశాఖాధికారి కె.సోంబాబు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ, మండల క్రీడా పరిశీలకులు వి.పుష్పనాథం, రాకోటి రాములు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. క్రీడల నిర్వహణలో తీసుకోవాల్సిన నిబంధనలు, ప్రొటోకాల్‌పై చర్చించారు. సచివాలయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి మండల స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు.



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహణపై చర్చిస్తున్న అధికారులు, వ్యాయామోపాధ్యాయులు

ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి..



మంగళపురంలో ప్రజలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూల్: తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. నగావళి నదీతీర ప్రాంత గ్రామాలైన చిన్న, గొట్ట మంగళాపురం, గోపాలపురం, అన్నవరం, అంపిలితో పాటు వెలగవాడ, తదితర గ్రామల్లో సచివాలయ సిబ్బందితో కలసి సోమవారం పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు, తీర ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సచివాలయ సిబ్బందిని సూచించారు.

సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

కొమరాడ: మిచాంగ్ తుపాను నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం సీఐ స్వామినాయుడు సూచించారు. సోమవారం మండలంలోని నదీ తీర ప్రాంతాలైన పాతకల్లికోట, పాతదుగ్గి గ్రామాలకు వెళ్లిన ఆయన అక్కడి వారితో కాసేపు మాట్లాడారు. తుపాను కారణంగా భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎటువంటి నష్టం జరగకుండా తుపాను తగ్గేంత వరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. ఆపద అనిపిస్తే అధికారులకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కొమరాడ ఎస్‌ఐ.కె.నీలకంఠం, సర్పంచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నాగావళి నదీ ప్రవాహం పరిశీలిస్తున్న సీఐ స్వామినాయుడు

గిరిజన స్పందనకు 15 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 15 వినతులు వచ్చాయి. డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని పాంద్రమానుగూడకు చెందిన సవర రమేష్ కోరారు. చింతలగూడకు చెందిన తురకన్న ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల రీ సర్వే చేయాలని కోరుతూ పలువురు వినతిపత్రం అందజేశారు. సీదిగూడ గ్రామస్తులు జీజీఎంపీ పనులు త్వరితగతిన చేపట్టాలని వినతి ఇచ్చారు. అంగన్‌వాడీ భవనం నిర్మించామని.. బిల్లులు మంజూరు చేయాలని వజ్జాయిగూడ మహేష్ కోరారు. వలసగూడ నుంచి లోతుగూడకు రోడ్డు నిర్మించాలని ఆయా ప్రాంత వాసులు కోరారు. చిన్నగోర కాలనీ వాసులు విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని కోరుతూ వినతి సమర్పించారు. స్పందనలో ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, పీఏఓ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

తెర్లాం: జగనన్న కాలనీ లేఅవుట్లు, సొంత స్థలాల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహ నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన మండలంలో జరగనున్న సామూహిక గృహ ప్రవేశాల నాటికి ఇళ్లను సిద్ధం చేయాలన్నారు. 294 ఇళ్ల నిర్మాణాలను లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని, వీటిన్నింటినీ పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించి, అర్హులైన కులవృత్తుల వారు రుణాల కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. త్వరలో చేపట్టనున్న కుల గణనకు సంబంధించి, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, ప్రతీ సచివాలయ ఉద్యోగికి 100 ఇళ్ల సర్వేకు అప్పగించడం జరుగుతుందన్నారు. కొద్దిరోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలును యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. మండలంలోని యు.వెంకమ్మపేట, వండవ, పనసనందివాడ, తలవరం, చలివేంద్రి గ్రామాల్లో సోమవారం 220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతుల వద్ద ధాన్యం ఉంటే సమీప రైతుభరోసా కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



యు.వెంకమ్మపేట వద్ద రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

ఆరోగ్య భద్రతపై దృష్టి సారించండి



సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న నగర కమిషనర్ సర్వేశ్వరరావు

- నగర కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అకాల వర్షాల ప్రభావంతో పట్టణ ప్రజలు అనారోగ్యం పాలవకుండా సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పట్టణ పరిధిలోని తొమ్మిది సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. హెల్త్ సిబ్బంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతు న్న వారిని గుర్తించి సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్.. వార్డుల్లో పారిశుధ్య పనుల తాజా స్థితిగతులపై సమీక్ష చేపట్టారు. ఆస్తి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

పాలకొండ రూరల్: ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు తెలియజేస్తున్న ఫిర్యాదులపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆర్డీఓ లావణ్య అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పాలకొండ మండలం సింగన్నవలస వయా సీతంపేట రహదారిలో ఉన్న మలుపు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఆ ప్రదేశం వద్ద హెచ్చరిక బోర్డులు గాని, స్పీడ్‌బ్రేకర్లు గాని ఏర్పాటు చేయాలని రామ్‌ప్రసాద్, మదన్ తదితరులు కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ లావణ్య

కళ్లాల్లో ధాన్యం తరలింపు

సీతానగరం: మండలంలోని కళ్లాల్లో నూర్పు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం అంటిపేట, పణుకుపేట, చినభోగిలి గ్రామాల్లోని కళ్లాల్లోని ధాన్యానికి ట్రక్‌షీట్ కట్‌చేసి మిల్లులకు జీపీఎస్ విధానంలో తరలించామని చెప్పారు. కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా 1944 బ్యాగులు మిల్లులకు తరలించినట్లు చెప్పారు. ఈ రెండురోజుల్లో 11,828 బ్యాగులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా మిల్లులకు తరలించినట్లు తెలిపారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కళ్లాల్లో ధాన్యం తడిసిపోయి, రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యగా ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ మేలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి ఒక్క కుటుంబానికి మేలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 27, 28 వార్డు సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, సంక్షేమ అభివృద్ధి పథకాల లబ్ధిని తెలియచేసే డిస్ ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వార్డుల పరిధిలో అభివృద్ధికోసం రూ.13.33 కోట్లు వెచ్చించామన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు పూర్తిగా దోహద పడడమే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు చేదోడు వాదోడుగా నిలిచి, ప్రజలందరి మద్దతు పొందుతూ పేదవాడి మనసు గెలుచుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనన్నారు. ఇన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి సామాజిక సమతుల్యతను తీసుకువస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు కనుకనే మళ్లీ సీఎంగా రాష్ట్రానికి జగనే కావాలని ఆకాంక్షించారు.

సచివాలయం పరిధిలో గల అన్ని గ్రామాల ప్రజానీకం అంతా మళ్లీ వచ్చే ఎన్నికలలో మీ పూర్తి మద్దతును జగన్‌మోహన్‌రెడ్డికి అందజేసి మళ్లీ సీఎంగా గెలిపించే బాధ్యత మీ అందరిపై ఉందని కోరారు. అనంతరం గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వారు అడిగిన అన్ని సమస్యలకూ సావధానంగా సమాధానాలు చెపుతూ వేదిక వద్దనే సంబధిత అధికారులకు ఆదేశించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కె.రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక కౌన్సిలర్‌లు మజ్జి శశిభర్, యడ్ల త్రినాథ, జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీ వి.గుర్రాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్‌లు మజ్జి నాగమణి, చెవిటి వెంకటరమణ, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సీతానగరం: లక్ష్మీపురంలో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు